kalamdaily.com
# కలం
ప్రజల గళం...
Follow on: Kalamtelugu
గురువారం, మార్చి 12, 2026 | పేజీలు: 2
360° SINGLE TOPIC
యుద్ధ ప్రభావం

ఇరాన్‌లో యుద్ధంతో ఇండియాలో గిగ్ వర్కర్ల నెత్తిన పిడుగు పడింది. కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ల షార్టేజీతో హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడుతున్నాయి. మెనూ నుంచి డీప్ ఫ్రై వెరైటీలను తొలగించాయి. పార్సిల్ సర్వీసులను ఆపివేశాయి. ఫుడ్ డెలివరీలనూ తగ్గించేశాయి. దీంతో స్విగ్గీ, జొమాటో లాంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ఆర్డర్లు తగ్గిపోతున్నాయి. వీటిపై ఆధారపడి బతుకుతున్న యువతకు ఉపాధి అవకాశాలు సన్నగిల్లాయి. ఒక్కొక్కరికి ప్రతి రోజు యావరేజ్‌గా ఉండే 15 ఫుడ్ డెలివరీలు ఇప్పుడు నాలుగైదుకు పడిపోయాయి. ఉద్యోగ భద్రత లేని డెలివరీ బాయ్‌లు ప్రత్యామ్నాయాన్ని వెతుక్కుంటున్నారు. మరోవైపు సీఎన్జీ, ఎల్పీజీ సప్లై పరిమితం కావడంతో ఓలా, ఉబర్ డ్రైవర్లూ రీఫిల్లింగ్ కోసం బంకుల దగ్గర గంటల కొద్దీ వెయిట్ చేయాల్సి వస్తున్నది. దీంతో బుకింగ్‌లు తగ్గిపోతున్నాయి. ఈ యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియని అనిశ్చితి వారి ఫ్యూచర్‌ను ప్రశ్నార్థకం చేసింది. గిగ్ వర్కర్లపై కలం 360 డిగ్రీస్ స్పెషల్.

- తెలంగాణ బ్యూరో, కలం

# గిగ్ వర్కర్లకు వార్ కష్టాలు




## గ్యాస్ కొరతతో మూతపడుతున్న రెస్టారెంట్లు

## పార్సిల్ సర్వీస్ క్లోజ్

## ఆర్డర్లు లేక ఆందోళనలో గిగ్ వర్కర్లు

### రోజుకు 3 ఆర్డర్లు కూడా రావట్లేదు..

మూడేండ్లుగా మాదాపూర్, గచ్చిబౌలి ఏరియాల్లో ఫుడ్ డెలివరీ చేస్తున్నా. డైలీ యావరేజ్‌గా 10 నుంచి 12 ఆర్డర్లు కంప్లీట్ అయ్యేవి. ఎల్పీజీ సిలిండర్ల షార్టేజీతో రోజుకు 3 ఆర్డర్లూ రావట్లేదు. చాలా హోటళ్లు మెనూ మార్చేశాయి. బుకింగ్ యాప్‌లో 'ఆఫ్‌లైన్' చూపిస్తున్నాయి. ఆర్డర్లు బుక్ కావట్లేదు. ''గ్యాస్ అయిపోయింది బాబూ.. ఉన్న కొద్దిపాటి స్టాక్‌తో డైన్-ఇన్ కస్టమర్లకే వండలేకపోతున్నాం. ఇక పార్సిల్స్ ఏం ఇస్తాం?" అని అంటున్నారు. రోజుకు 15 నుంచి 20 ఆర్డర్లు చేస్తేనే ఇంటి ఖర్చులు, పెట్రోల్ ఖర్చులు, బైక్ ఈఎంఐ అవసరాలు తీరుతాయి. ఆర్డర్లు తగ్గడంతో ఇబ్బందులు మొదలయ్యాయి.
ఇంకో నాలుగు రోజులు ఇలాగే ఉంటే కిస్తీలు కట్టడం కష్టమే. కుటుంబాన్ని పోషించడమూ ఇబ్బందే. ప్రభుత్వమే ఏదైనా చేయాలి. హోటళ్లకు గ్యాస్ అందేలా చూడాలి. ఆర్డర్ల బాధ తప్పుతుంది.

- రమేశ్, ఫుడ్ డెలివరీ బాయ్, హైదరాబాద్






గ్యాస్ కొరత కారణంగా రెస్టారెంట్లు మూతపడడం అనేది ఒక చైన్ రియాక్షన్ లాంటిది. దీంతో హోటల్ యజమానులు, సిబ్బందితో పాటు ఉపాధి కోల్పోయేది ఫుడ్ డెలివరీ యాప్స్‌పై ఆధారపడి పని చేసే గిగ్‌వర్కర్లే. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ ప్రకారం.. రాష్ట్ర వ్యాప్తంగా ఫుడ్ డెలివరీ యాప్ జొమాటోలో 55వేల మంది, స్విగ్గీలో 50వేల మంది గిగ్ వర్కర్లు పని చేస్తున్నారు. హైదరాబాద్‌లో రెస్టారెంట్లు మూతపడితే గిగ్ వర్కర్లంతా రోడ్డునపడుతారు.

- నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా 2024 లెక్కల ప్రకారం.. తెలంగాణ వ్యాప్తంగా చిన్నా పెద్ద రెస్టారెంట్లు కలిపి దాదాపు 1.10 లక్షల వరకు ఉంటాయి.
- ఒక్క హైదరాబాద్‌లోనే 70వేల వరకు ఉన్నాయి. వీటిలో ఆర్గనైజ్డ్ సెక్టార్ (జీఎస్టీ చెల్లించే, గుర్తింపు పొందినవి) కింద 40వేల రెస్టారెంట్లు ఉన్నాయి. అన్ ఆర్గనైజ్డ్ సెక్టార్ (చిన్న చిన్న గల్లీల్లో ఉండే టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ బండ్లు) కింద సుమారు 31 వేల హోటళ్లు ఉన్నాయి.
- ఆర్గనైజ్డ్ సెక్టార్‌లో అత్యధికంగా క్లౌడ్ కిచెన్స్ (16వేలు) ఉన్నాయి. స్విగ్గీ, జొమాటో ద్వారా ఆన్‌లైన్ డెలివరీలు మాత్రమే చేసే కిచెన్స్ హైదరాబాద్‌లోనే ఎక్కువ.
- ఏడాదికి రూ.10,161 కోట్ల టర్నోవర్‌తో దేశంలోనే అతిపెద్ద ఫుడ్ సర్వీసెస్ మార్కెట్లలో హైదరాబాద్ 6వ స్థానంలో నిలిచింది. (రూ.55వేల కోట్లతో ముంబై ఫస్ట్)
- రోడ్ సైడ్ బండ్లు, చిన్న హోటళ్లు కూడా కలుపుకుంటే హైదరాబాద్ ఫుడ్ బిజినెస్ విలువ ఏడాదికి రూ. 5.69 లక్షల కోట్లకు పైమాటే.
- హైదరాబాద్‌లోని ఆర్గనైజ్డ్ రెస్టారెంట్లు నెలకు సగటున సుమారు రూ.846 కోట్ల వ్యాపారం చేస్తున్నాయి.
- హైదరాబాద్‌లో గ్యాస్ సిలిండర్ కొరత తీవ్రమైతే.. హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడే అవకాశాలున్నాయి.

కలం
ప్రజల గళం...
360°
గురువారం,
మార్చి 12, 2026
02




## ఫుడ్ డెలివరీ చేసేది లక్ష మంది పైనే

కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరత వల్ల హైదరాబాద్‌తో పాటు తెలంగాణవ్యాప్తంగా గిగ్ వర్కర్ల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉంది. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ ప్రకారం.. సుమారు 3 లక్షలకు పైగా గిగ్ వర్కర్లు ఉన్నారు. వారిలో 1.05 లక్షల మంది జొమాటో, స్విగ్గీ లాంటి ఫుడ్ డెలివరీలో పని చేస్తున్నారు.

- హైదరాబాద్‌లో రోజుకు సగటున 6 లక్షల వరకు ఫుడ్ ఆర్డర్లు (స్విగ్గి, జొమాటో కలిపి) వస్తుంటాయి. వీకెండ్స్‌లో ఇవి 8 లక్షల వరకు చేరుకుంటాయి.
- ఒక గిగ్ వర్కర్ ఫుల్ టైమ్‌గా 10 నుంచి 12 గంటలు పని చేస్తాడు. రోజుకు 15 నుంచి 22 ఆర్డర్లు డెలివరీ చేస్తాడు. పార్ట్‌టైమ్ వర్కర్ అయితే 4 నుంచి 6 గంటలు పని చేస్తాడు. 7 నుంచి 10 ఆర్డర్లు డెలివరీ చేస్తాడు.
- పెట్రోల్, మెయింటెనెన్స్ పోను ఒక ఫుల్ టైమ్ గిగ్ వర్కర్‌కు రోజుకు సుమారు రూ.700 (ఇన్సెంటివ్ కలిపి) వరకు మిగులుతుంది. నెలకు రూ.20వేల వరకు సంపాదిస్తాడు.

## గిగ్ వర్కర్ల భద్రతకు చట్టం వచ్చేదెన్నడో..!

'తెలంగాణ గిగ్ వర్కర్ల సంక్షేమ బిల్లు- 2'కు గత నవంబర్ లో తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రత్యేక సంక్షేమ బోర్డు, అగ్రిగేటర్ల నుంచి 1-2 శాతం వాటా సంక్షేమ నిధికి మళ్లింపు, 7 రోజుల నోటీసు లేకుండా ఉద్యోగుల తొలగింపు నిషేధం.. వంటివి బిల్లులో చేర్చింది. అయితే.. ప్రభుత్వం ఇంకా చట్టంగా రూపొందించలేదు. ఒకవేళ గిగ్ వర్కర్ల చట్టం తెస్తే.. తొలిరాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 3 లక్షల నుంచి 4 లక్షల మంది వరకు గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లు ఉన్నట్టు అంచనా. వీరిలో ఎక్కువ మంది రవాణా, డెలివరీ, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో ఉన్నారు. వీరు రోజుకు 10 –12 గంటలు కష్టపడుతున్నా.. ప్లాట్‌ఫామ్ వర్కర్ల ఆదాయంలో 20 –30 శాతం వరకు కమిషన్‌గా తీసుకుంటున్నాయి. దీనివల్ల స్థిరమైన ఆదాయం, సామాజిక భద్రత లేకుండా పోయింది. కాగా.. ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు పెరిగాయి. ఈ-కామర్స్ , ఫుడ్ డెలివరీ ఆర్డర్లపై ఎఫెక్ట్ పడింది. ఇది గిగ్ వర్కర్ల రోజువారీ ఆదాయాన్ని దెబ్బతీస్తున్నది. హైదరాబాద్ వంటి నగరాల్లో డెలివరీ, రైడ్-హెయిలింగ్ ప్లాట్‌ఫారమ్‌లలో పనిచేసే గిగ్ వర్కర్ల ఆదాయం తగ్గుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేయకపోవడంతో భద్రతపై గిగ్ వర్కర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదుకోవాలని కోరుతున్నారు.

## బతుకులు రోడ్డుపాలు!

- గిగ్ వర్కర్లు నో వర్క్ నో పే పద్ధతిలో పని చేస్తారు. రెస్టారెంట్లు బంద్ అయితే యాప్‌లో ఆర్డర్లు ఉండవు. ఒక్కరోజు పని లేకపోయినా ఆ రోజు ఆదాయం పూర్తిగా కోల్పోతారు.
- కంపెనీలు రోజుకు ఇన్ని ఆర్డర్లు పూర్తి చేస్తేనే అదనపు బోనస్ ఇస్తాయి. హోటళ్లు లేక ఆర్డర్లు తగ్గితే, కష్టపడి చేసిన కొన్ని ఆర్డర్లకు కూడా సరైన ఆదాయం రాదు.
- హైదరాబాద్‌లోని దాదాపు 90% మంది డెలివరీ బాయ్స్ తమ బైక్‌లను ఫైనాన్స్‌లో తీసుకున్నవారే. ఆదాయం ఆగిపోతే నెలాఖరున ఈఎంఐలు కట్టడం భారమవుతుంది.

## ముంబైలో మూతపడిన రెస్టారెంట్లు

కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ల కొరత కారణంగా దేశవ్యాప్తంగా రెస్టారెంట్లు, హోటళ్ల పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. మెట్రో, టైర్ 1 నగరాల్లో దీని ఎఫెక్ట్ ఎక్కువగా ఉంది. ముంబైలో సుమారు 20 శాతం హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడ్డాయి. మరో 2 రోజులు పరిస్థితి ఇలాగే ఉంటే 50 శాతం రెస్టారెంట్లు మూతపడొచ్చని వ్యాపారులు చెప్తున్నారు. బెంగళూరు, చెన్నైలోనూ చిన్న, మధ్య తరహా హోటళ్లు మూతపడ్డాయి. బఫర్ స్టాక్ ఉన్న కొన్ని పెద్ద రెస్టారెంట్లు మాత్రమే లిమిటెడ్ మెనూతో నడుస్తున్నాయి. పుణె, గురుగావ్, ఢిల్లీ, పుదుచ్చేరి, ఏపీలోనూ రెస్టారెంట్లు మూతపడ్డాయి. కొన్ని చోట్ల కట్టెల పొయ్యితో పని కానిచ్చేస్తున్నారు. నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా లెక్కల ప్రకారం.. దేశవ్యాప్తంగా 5 లక్షలకు పైగా రెస్టారెంట్లు ఉన్నాయి. వీటిలో 90 శాతం రెస్టారెంట్లు ఎల్పీజీ గ్యాస్ పైనే ఆధారపడి నడుస్తున్నాయి. ఈ రెస్టారెంట్లపై సుమారు కోటి మంది ఆధారపడి పని చేస్తున్నారు.







## పార్సిల్ కౌంటర్లు బంద్!

హైదరాబాద్‌లో ఇప్పటికే 11,000 పైగా పీజీ హాస్టళ్లు, వేలాది రెస్టారెంట్లు గ్యాస్ అందక మెనూ తగ్గిస్తున్నాయి. దీనికితోడు పార్సిల్ సర్వీసులనూ తాత్కాలికంగా నిలిపివేశాయి. ప్రస్తుతం రెస్టారెంట్ల వద్ద ఉన్న గ్యాస్ స్టాక్ కేవలం 1 లేదా 2 రోజులకు మాత్రమే సరిపోతుంది. ఆ ఉన్న గ్యాస్‌తో హోటల్‌కు వచ్చే కస్టమర్లకు మాత్రమే భోజనం అందించాలని, పార్సిల్స్ (స్విగ్గీ, జొమాటో లేదా కౌంటర్ టేక్-అవే) ద్వారా అదనపు వంటలు చేసి గ్యాస్ వృథా చేయకూడదని యాజమాన్యాలు నిర్ణయించుకున్నాయి.

- పార్సిల్స్ కోసం ప్రత్యేకంగా కొన్ని ఐటమ్స్ (తందూరీ, స్టార్టర్స్) తయారు చేయాల్సి ఉంటుంది. వీటికి గ్యాస్ ఎక్కువగా ఖర్చవుతుంది. గ్యాస్ తక్కువగా ఉన్నప్పుడు ఎక్కువ మందికి వడ్డించగల వంటకాలపై (బిర్యానీ వంటివి) మాత్రమే దృష్టి పెడుతున్నారు.
- హోటల్‌కు నేరుగా వచ్చే కస్టమర్లకు సర్వీస్ ఇవ్వడం తమ మొదటి బాధ్యతగా రెస్టారెంట్ యాజమాన్యాలు భావిస్తున్నాయి.
- గచ్చిబౌలి, మాదాపూర్ వంటి ప్రాంతాల్లో 70% వ్యాపారం పార్సిల్స్ ద్వారానే జరుగుతుంది. అక్కడ గ్యాస్ అందకపోవడంతో 'మేము వంట చేయలేం' అని యాప్స్‌లో ఆఫ్‌లైన్ అవుతున్నారు.
- గ్యాస్ దొరక్కపోవడంతో కొన్ని చోట్ల వంటకాల ధరలను 10-15 శాతం పెంచారు. దోశ, పూరీ వంటి గ్యాస్ ఎక్కువగా తీసుకునే టిఫిన్లను మెనూ నుంచి తొలగిస్తున్నారు.
- హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ మేనేజ్‌మెంట్ కూడా లిమిటెడ్ మెనూ అందుబాటులో ఉంచింది. బుధవారం నుంచే పార్సిల్ సర్వీసు ఆపేసింది. సభ్యులంతా సహకరించాలని రిక్వెస్ట్ చేసింది.

## 5లక్షల మంది వీధి వ్యాపారులు

తెలంగాణ వ్యాప్తంగా సుమారు 5 లక్షల మందికిపైగా వీధి వ్యాపారులు ఉన్నారు. హైదరాబాద్‌లో లక్షన్నర వరకు ఉంటారు. ఇందులో దాదాపు 85 వేల వరకు చిన్నచిన్న టిఫిన్ బండ్లు, చాట్ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు నడిపేవాళ్లు ఉన్నారు. వీరిలో దాదాపు 69 శాతం మంది తమ కుటుంబాన్ని కేవలం ఈ బండిపై వచ్చే ఆదాయంతోనే పోషించుకుంటున్నారు.

- హోటళ్లు, రెస్టారెంట్ల కంటే వీధి వ్యాపారుల పరిస్థితి దయనీయంగా ఉంది. ఎందుకంటే వీరికి పెద్ద హోటళ్లలాగా సిలిండర్లను స్టాక్ పెట్టుకునే సామర్థ్యం ఉండదు.
- గ్యాస్ ఎక్కువగా ఖర్చయ్యే ఫ్రైడ్ రైస్, నూడిల్స్, మంచూరియా వంటి ఐటమ్స్‌ను చాలా మంది వెండర్లు తాత్కాలికంగా నిలిపివేశారు. త్వరగా తయారయ్యే లేదా తక్కువ సెగతో వండగలిగే వంటకాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు.
- గతంలో ఉదయం నుంచి రాత్రి వరకు బండ్లు నడిపేవారు. ఇప్పుడు కేవలం పీక్ అవర్స్ (ఉదయం టిఫిన్ లేదా సాయంత్రం స్నాక్స్) మాత్రమే బండ్లు తీస్తున్నారు. గ్యాస్ అయిపోతే మళ్లీ దొరకదనే భయమే దీనికి ప్రధాన కారణం.
- కొందరు వెండర్లు గ్యాస్ దొరక్కపోవడంతో బొగ్గు, కట్టెల పొయ్యిని వాడుతున్నారు. కరెంట్ కనెక్షన్ ఉన్న చోట చిన్నపాటి ఇండక్షన్ స్టౌవ్‌లను వాడుతున్నారు.
- ఒక గ్యాస్ సిలిండర్ బ్లాక్‌లో3వేలకు కొంటున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్లేట్ ఫుడ్ మీద రూ.5 నుంచి రూ.10 వరకు ధర పెంచారు.

## 50 రూపాయలతో ఇల్లు గడిచేదెలా?

చార్మినార్, పాతబస్తీ ఏరియాల్లో డెలివరీ పార్ట్‌నర్‌గా పని చేస్తున్నాను. మా ఏరియాలో హోటళ్లు ఎప్పుడూ బిజీగా ఉండేవి. కానీ, రెండు రోజుల నుంచి పరిస్థితి మారిపోయింది. చాలా రెస్టారెంట్లు 'నో పార్సిల్స్' బోర్డు పెట్టేశాయి. రోజంతా ఎండలో ఆర్డర్ సిగ్నల్ కోసం చూస్తున్నా. కానీ ఫోన్‌లో ఆర్డర్ సౌండే లేదు. పొద్దున 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తిరిగితే నాకు రూ. 150 వస్తే ఎక్కువ. పెట్రోల్‌కే రూ. 100 పోతుంది. మిగిలిన రూ.50తో ఇంటిని నెట్టుకొచ్చేదెలా? పెళ్లిళ్ల సీజన్ కావడంతో గ్యాస్ అంతా అక్కడికే వెళ్తోందని అంటున్నారు. మాకు ఆర్డర్లు రాకపోతే కంపెనీలు ఇచ్చే 'డైలీ టార్గెట్ ఇన్సెంటివ్స్' కూడా రావు.

- సయ్యద్, గిగ్‌వర్కర్, హైదరాబాద్

